అవకాశమివ్వండి.. ప్రజాపాలన అందిస్తా

మల్కాజిగిరి స్వతంత్ర ఎంపీ అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్


కొత్తపేటలో ప్రచారం చేస్తున్న వైష్ణవీ ప్రసాద్

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజల మనిషిగా, నిత్యం ప్రజల మధ్యే ఉండి ప్రజాపాలన అందిస్తానని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, మారుతీనగర్, చైతన్యపురి, నాగోలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందిచడం, ప్రతీ నియోజకవర్గంలోను ఆదర్శ విద్యాలయాలు, ధర్మాసుపత్రులు నెలకొల్పడంతో పాలు నిత్యం ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజల వినతుల స్వీకరణ, పరిష్కారానికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కార్యాలయం ఏర్పాటు చేస్తానని తెలిపారు. సరికొత్త పరిశ్రమల స్థాపనకు రూపకల్పన, యువతకు ఉపాధి అవకాశాలు, చెరువుల సంరక్షణ, సుందరీకరణ, కబ్జాల నుంచి చెరువులను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జవహర్‌నగర్ లో ఉన్న వ్యర్థాల గుట్టను తొలగించడానికి, కరిగించడానికి ప్రణాళిక అమలు చేస్తానన్నారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీవాసులు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దడ్డు సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం పోలింగ్ జరిగేలా చూడాలి

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: బూత్ అధ్యక్షులకు అప్పజెప్పిన ఓట్లు 100 శాతం కమలం గుర్తుకు పోలయ్యేలా కృషి చేయాలని జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుర్మగూడ డివిజన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సహదేవ్ యాదవ్ మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరో రెండు వారాలు కష్టపడితే దేశం మరో ఐదేళ్ల భద్రంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకొని చరిత్రను తిరగరాయాలని అన్నారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఆలె భాస్కర్‌రాజ్, ఆదర్ల మహేష్, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, శ్వేత, ధీరజ్‌లాల్, దేవరాజ్, తంగెళ్ల సుధీర్, నిరంజన్‌యాదవ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు హామీలను ఎందుకు నెరవేర్చలేదు?

బీజేపీ నేత అందెల శ్రీరాములు యాదవ్


సమావేశంలో మాట్లడుతున్న అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి


దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. బుధవారం వారు ఆర్‌కేపురం డివిజన్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం రాత్రి ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి బీజేపీపై చేసిన ఆరోపణలను ఖండించారు. సీఎం హోదాలో ఎన్టీఆర్‌నగర్‌కు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కొత్తగా వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ నగర్ సమస్యను పరిష్కరించాలంటే 25 వేల ఓట్ల మెజారిటీ ఇవ్వాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటు అని అన్నారు. చేవెళ్ల ఎంపీ స్థానంలో కాంగ్రెస్ ఓడిపోతే ఎన్టీఆర్‌నగర్ సమస్యను పరిష్కరించరా అని వారు ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను ఎందుకు నెరవేర్చలేదని వారు ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పాలన అందించడం లేదని, భారత్ పాలన అందిస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాములు యాదవ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'మెగాసిటీ' ప్రభంజనం


ఉత్తమ ఫలితాలు సాధించిన మెగాసిటీ పాఠశాల విద్యార్థులు

హయత్‌నగర్: పదో తరగతి పరీక్షల్లో హయత్‌నగర్‌లోని మెగా సిటీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. మొత్తం 83 మంది విద్యార్థులలో 39 మంది 9 జీపీఏకు పైగా సాధించారని, వీరిలో ఐదుగురు 10/10 జీపీఏతో సత్తా చాటారని పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. 10 జీపీఏ సాధించిన వారిలో యశస్విని, సాహితీ, వికాస్, దేవహర్ష, యశ్వంత్ ఉన్నారని, వీరితో పాటుగా 8 మంది 9.8 జీపీఏ, ఏడుగురు 8.7 జీపీఏ, ఆరుగురు 9.5 జీపీఏ సాధించారని ఆయన అన్నారు. ఉత్తమ ప్రతిభ చాటుకున్న విద్యార్థులను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠాలు బోధించడం, వారికి చదువుతో పాటు క్రమశిక్షణను నేర్పించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపల్ వాసు, వైస్ ప్రిన్సిపల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో సిద్దార్థ విద్యార్థుల విజయభేరి


సిద్దార్థ విద్యాసంస్థ విద్యార్థులతో చైర్మన్ ఇంద్రారెడ్డి

వనస్థలిపురం: పదో తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని వనస్థలిపురంలోని సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కె.ఇంద్రారెడ్డి, కరస్పాండెంట్ నాగలక్ష్మి తెలిపారు. 17 మంది విద్యార్థులు 10 జీపీఏ, 14 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారని వారు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ అభినందించారు.


లయోల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సత్తా చాటిన లయోల విద్యార్థులు

పదో తరగతిలో వనస్థలిపురంలోని లయోల మోడల్ హైస్కూలు విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని లయోల విద్యాసంస్థల చైర్మన్ రంగినేని వెంకట్‌రావు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించగా పలువురు విద్యార్థులు 9.0 జీపీఏకు పైగా సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా మేడే వేడుకలు


బీఎన్‌రెడ్డి నగర్‌లో మేడే వేడుకల్లో పాల్గొన్న మధుయాష్కీ

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం.. మేడే ను మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక (ఎర్ర) జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను నేటి పాలకులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. కార్మిక, కర్షకుల శ్రమను సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న వారికి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

- కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా కార్మిక జెండాను ఎగురవేశారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మారోజు సునీల్ కుమార్, వర్కర్స్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జంగయ్య ముదిరాజ్, నాయకులు రాములు, యాదయ్య, రవికుమార్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- నాగోలు చౌరస్తాలో... తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా సీపీఐ ఉప్పల మండల కార్యదర్శి పులిరాం నారాయణ హాజరై అరుణ పతాకాన్ని ఎగురవేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఉడతల మల్లేష్‌గౌడ్, నాయకులు భూపతి సురేష్, ఎండీ బషీర్, వెంకటేష్, రాములు, జంగయ్య, నర్సింహారావు, సైదరావు పాల్గొన్నారు.
- ఆటోనగర్‌లో...

ఏఐసీయూటీసీ హయత్‌నగర్ మండల అధ్యక్షుడు గోల్కొండ నాగరాజు ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని ఇసుక లోడింగ్, అన్‌లోడింగ్ ప్రాంగణం వద్ద మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి ముఖ్యఅతిథిగా హాజరై కార్మిక జెండాను రవీంద్రచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్విరామ పోరాటాలతో కార్మికులు సాధించుకున్న 40 చట్టాలను నేటి బీజేపీ పాలకులు కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు రమావత్ సక్రునాయక్, పోలోజు లక్ష్మణాచారి, వంశీవర్ధన్ రెడ్డి, శ్రీదేవి, సురేందర్, సుజాత, సరిత, శంకర్, జానీ, వెంకట్, శోభన్, శ్రీకాంత్, ముత్తయ్య పాల్గొన్నారు.

- బ్యాంక్ కాలనీ చౌరస్తాలో ..

బీఎస్‌రెడ్డి డివిజన్ గాయత్రీనగర్, బ్యాంక్ కాలనీ చౌరస్తాలో కార్మిక నేత భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మిక సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు విక్రయించడమే కాకుండా వారు తీసుకున్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు.


కొత్తపేటలో జెండా ఎగురవేస్తున్న వర్కర్స్ పార్టీ అధ్యక్షుడు పాండురంగాచారి

వనస్థలిపురం లేబర్ అడ్డాలో ...

ఎల్‌బీనగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం లేబర్ అడ్డా వద్ద నిర్వహించిన మేడే వేడుకల్లో సీఐటీయూ నాయకుడు, విశ్రాంత అధ్యాపకుడు కేశవరావు కార్మిక జెండాను ఎగురవేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికుల సంక్షేమం, హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపు ఇచ్చారు. కార్మిక నాయకులు బీజీఎంరెడ్డి, ఆంజనేయులు, పురుషోత్తం, రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

- సింగరేణి కాలనీలో...

ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీలో డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. సీపీఐ నాయకుడు శంకర్‌నాయక్, ఏఐటీయూసీ ఆటో యూనియన్ హైదరాబాద్ కార్యదర్శి జంగయ్య, సీపీఐ నాయకులు అంజయ్య, శ్యాం, రవి పాల్గొన్నారు.


నాగోలులో.. సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి నారాయణ


ఆటోనగర్‌లో మే డే ఉత్సవాల్లో పాల్గొన్న ఏఐటీయూసీ నేతలు


సింగరేణి కాలనీలో .. సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 19, వంకాయ 23, బెండ 35, పచ్చి మిర్చి 50, కాకర 32, బీర 35, క్యాబేజీ 17, ఫ్రెంచి బీన్స్ 85, క్యారెట్ 35, దొండ 28–33, చిక్కుడు 55, గోకర 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 47, ఆలు 33, దోస 15, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 35. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ప్రతీ గురువారం ఉచిత వైద్య శిబిరం

చైతన్యపురి: భక్తుల శ్రేయస్సు కోసం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రతీ గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మలక్‌పేట యశోద ఆసుపత్రి సౌజన్యంతో మే నెలలో ప్రతీ గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. మొదటి గురువారం కార్డియాలజీ, జనరల్ వైద్య సేవలు, 2వ గురువారం ఆర్థోపెడిక్, జనరల్, 3వ గురువారం గైనకాలజీ, జనరల్ నాలుగో గురువారం కార్డియాలజీ, జనరల్, 5వ గురువారం వైద్యులు జనరల్ పరీక్షలు చేస్తారన్నారు. వీటితో పాటు బీపీ, మధుమేహ పరీక్షలను ఉచితంగా చేస్తారని చైర్మన్ తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హయత్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రవీందర్ గౌడ్

హయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా చెన్నగోని రవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జారీ చేసిన నియామక పత్రాన్ని బుధవారం పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు మధుయాష్కీ గౌడ్ చేతుల మీదుగా రవీందర్‌గౌడ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను డివిజన్‌లోని అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని, డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు.



మజ్లిస్‌ను గెలిపించండి..అభివృద్ధికి సహకరించండి

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని అధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం అక్బర్‌బాగ్‌లో డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పతంగి గుర్తుకు ఓటేసి మరోసారి హైదరాబాద్‌లో మజ్లిస్ జెండాను ఎగురవేయాలని కోరారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే మజ్లిస్ ఎజెండా అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అక్బర్‌బాగ్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బలాల

బీసీలను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదు: ఆకుల


మాట్లాడుతున్న ఆకుల రాజేశ్వర్‌యాదవ్

సైదాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆకుల రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. బుధవారం సైదాబాద్‌లో నిర్వహించిన సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 55 శాతం ఉన్న బీసీలను పదేళ్ల బీజేపీ పాలనలో తీవ్రంగా నిర్లక్ష్యం చేశారన్నారు. కులగణన చేయమని చెప్పే బీజేపీ బీసీలను ఎలా ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ బీసీ సంఘాలు, పార్టీలు విన్నవించినా పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు ఐకమత్యంగా ఉండి బీజేపీకి ఓట్లు వేయవద్దని ఆయన కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు వైఆర్‌పీ ఫౌండేషన్ కృషి


విద్యార్థులను సన్మానిస్తున్న రవిప్రసాద్

దిల్‌సుఖ్‌నగర్: సమాజంలోని పేద విద్యార్థుల చదువులకు వైఆర్‌పీ ఫౌండేషన్ ఎల్లప్పుడు కృషి చేస్తున్నదని ఆ సంస్థ చైర్మన్ ఎలిషాల రవిప్రసాద్ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌ల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవిప్రసాద్ మాట్లాడుతూ, తమ ఫౌండేషన్ ద్వారా దాదాపు 28 మంది ఇంటర్ విద్యార్థులకు ఫీజులు చెల్లించామన్నారు. తమ ఫౌండేషన్ సహకారంతో చదువుకున్న బొడ్డు నవీన్ సాయి అనే విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో 2వ స్థానం సాధించాడన్నారు. ఫౌండేషన్ ద్వారా ఆర్థిక లబ్ధి పొందిన 12 మంది పదో తరగతి విద్యార్థులు 9.5 గ్రేడ్ లో ఉత్తీర్ణత సాధించారన్నారు శరత్ చంద్ర, హేమచంద్ర, ఎడ్ల కృష్ణారెడ్డి, చకిలం శేషగిరి రావు, మురిశెట్టి శ్రీనివాస్, షణ్ముఖం, దయాకర్, వాసు, సిబ్బంది శాంతి, శ్రీదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి కౌన్సిలర్ విద్యావతి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని బీఆర్ఎస్‌కి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజయేందర్‌రెడ్డి బుధవారం తమ అనుచరులతో పాటు బాటసింగారం సహకార సంఘం డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్‌సభ్యుడు ఎంఏ సత్తార్, వివిధ కాలనీలకు చెందిన సుమారు 300మందితో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రాంమ్మోహన్ నేతృత్వంలో పలువురు బీఆర్ఎస్ నేతలు బుధవారం ఎల్‌బీనగర్‌లోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హయత్‌నగర్ డివిజన్ నుంచి రాఖీగౌడ్, నాగోలు డివిజన్ నుంచి పెద్దపూర బ్రహ్మయ్య, వినయ్‌కుమార్, లింగోజిగూడ డివిజన్ నుంచి జాజుల కిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు చేరారు. చేరిన వారిలో ఎండీ షౌకద్దీన్, మండల శ్రీధర్, జాఫర్, రవిచందర్, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, శివకుమార్, రమేష్, శ్రీధర్, రేణుక, చైతన్య, రాధ, సర్వర్, నాగిళ్ల యాదగిరి, పున్నం రాములు, జూపల్లి అంజయ్య, కానుగుల అభి, వెంకటేష్, జెల్ల రవీందర్, రేవల్లి అంజయ్య, చెన్నారెడ్డి, బాలరాజు, పరశురామ్, నవాజ్, మణిక్యం, రాము తదితరులున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్లారపు షాలిని, ఎండీ జానిమియా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

చైతన్యపురి: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని, వాటి ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు అన్నారు. పైన్స్ యూనివర్స్ (స్పిరిచ్యువల్) ఆధ్యాత్మిక విభాగం ధ్యాన మనోప్రస్థానం ఆధ్వర్యంలో శ్రీగురు విశ్వస్ఫూర్తి 84వ జన్మదిన ఆరాధనోత్సవాల సందర్భంగా చైతన్యపురిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చలివేంద్రంలో మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేశారు. ఏఎస్ఐ గోవర్ధన్, నిర్వాహకులు ఎ.వెంకటస్వామి, నరసింహారెడ్డి ,శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


విద్యార్థులను సన్మానిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కొత్తపేట డివిజన్ ప్రజానివాస్ ఫేస్–2లో నివాసం ఉండే వనం హాసిని 10 జీపీఏ, లోకేష్ కుమార్ 9.8, సమిత 9.8, లహరిక 8.7 జీపీఏ సాధించారు. వీరిని కార్పొరేటర్ పవన్‌కుమార్ శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేసి అభినందించారు. వీరు పై చదువులో మరింత రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

అమిత్‌షా రోడ్ షోకు తరలిన బీజేపీ శ్రేణులు


ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాతబస్తీలోని లాల్‌దర్వాజలో బుధవారం నిర్వహించిన రోడ్‌షోకు మూసారంబాగ్ డివిజన్ నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. దేవేందర్, రమేష్‌రెడ్డి, సురేందర్, జక్కా మోహన్‌రెడ్డి, రంజిత్‌కుమార్, దినేష్, గణేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్‌లో ఏఐఎంఈపీ అభ్యర్థి ప్రచారం

సైదాబాద్: గత నలభై ఏళ్లుగా హైదరాబాద్ అభివృద్ధికి మతతత్వ పార్టీలు చేసింది ఏమీ లేదని ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ (ఏఐఎంఈపీ) హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి జాన్ మస్కీ అన్నారు. బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో పాదయాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ కరపత్రాలు పంచుతూ ఈసారి ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు

ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

సైదాబాద్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి నగదు పురస్కారాలు ప్రకటించారు. పదో తరగతి ఫలితాల్లో చంపాపేట శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో జశ్వంత్‌రెడ్డి, ప్రణహిత, సుహాఫాతీమా, శరోన్, శృతి, సిరిచందనలు 10/10 జీపీఏ సాధించారు. వీరికి ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు పురస్కారాన్ని పాఠశాలలో నిర్వహించిన సంబురాల్లో పాఠశాల డైరెక్టర్ ప్రకటించి అభినందించారు.

మిద్దెపై తోటల పెంపకంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: సేంద్రియ పద్ధతిలో మిద్దెపై తోటల పెంపకంపై ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ క్రాప్ ప్రొడక్షన్ విద్యార్థులు బుధవారం గృహిణులకు అవగాహన నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు ఎలా సాగు చేయాలో వివరించారు. దీనికి ఉపయోగించే ఎరువులను జీవామృత్, బిజామృత్, సంజీవక్, పంచామృత, వేపనూనె తదితర వాటిని తయారు చేసే విధానాన్ని, ఉపయోగించే పద్ధతులను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో, తక్కువ ప్రదేశంలో మిద్దె తోటల సాగుతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు రామరాజు, డాక్టర్ నాగోజీ తదితరులు పాల్గొన్నారు.